పరామర్శకు తోడు వెళ్లి.. అనంతలోకాలకు..

లారీ ఢీకొని ఫార్మా ఉద్యోగి మృతి



రమేష్ మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: రాత్రి విధులు ముగించుకుని ఆస్పత్రిలో ఉన్న బంధువును పరామర్శించడానికి తోడు వెళ్లిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా, బూర్జ మండలం, నారాయణపురం నాగావళి వీధికి చెందిన కునుబెల్లి రమేష్(30) ఏపిటోరియా ఫార్మా కంపెనీలో కెమిస్ట్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గాజువాకలో తమ్ముడితో కలిసి నివాసం ఉంటున్నాడు. అదే కంపెనీలో 68వ వార్డు అక్కిరెడ్డిపాలేనికి చెందిన కురిటి శ్రీనివాసరావు ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాసరావు తన స్కూటీని పాత గాజువాకలో పార్కింగ్ చేస్తాడు. అక్కడ కంపెనీ బస్సు దిగి అక్కిరెడ్డిపాలేనికి స్కూటీపై వస్తుంటాడు. ఇదిలా ఉండగా సోమవారం నైట్ డ్యూటీ చేసి మంగళవారం ఉదయం కంపెనీ బస్సులో వీరిద్దరూ పాత గాజువాక వద్ద దిగారు. శ్రీనివాసరావు బంధువు గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆయన్ని చూడటానికి ఇద్దరూ బయలుదేరారు. శ్రీనివాసరావు స్కూటీ నడుపుతుండగా రమేష్ వెనుక కూర్చున్నాడు. వారు ఆస్పత్రికి సమీపిస్తుండగా వెనుకనే వస్తున్న ఓ లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో స్కూటీ వెనుక కూర్చున్న రమేష్ కాళ్లు, నడుముకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మరణించాడు. శ్రీనివాసరావు తూలి పక్కకు పడిపోవడంతో భుజంపై గాయమైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి కేంద్రం.. గాజువాక

గాజువాక: ఉపాధి కేంద్రంగా ఉన్న గాజువాక పదేళ్లలో అభివృద్ధిలోనూ అగ్రభాగంలో నిలిచింది. పారిశ్రామిక ప్రగతితో పాటు కార్పొరేట్ కంపెనీలు, విద్యా సంస్థలు, స్థానిక వ్యాపారాలతో నిత్యం కళకళలాడుతోంది. దీంతో కార్పొరేట్ సంస్థలు సైతం గాజువాకకు క్యూ కడుతున్నాయి. పంచాయతీ నుంచి మున్సిపాలిటీ స్థాయికి, ఇప్పుడు గ్రేటర్ స్థాయికి ఎదిగిన పారిశ్రామిక పట్టణం ప్రస్తుతం భారీ పెట్టుబడులకు వేదికవుతోంది. దీంతో కార్పొరేట్ సంస్థలకు చెందిన ఆధునిక షాపింగు మాళ్లు, ఐనాక్స్ థియేటర్లు, వివిధ రంగాలకు చెందిన వ్యాపార సంస్థలు గాజువాక వాకిట్లో కొలువుదీరుతున్నాయి. షీలానగర్, కూర్మన్నపాలెం, శ్రీనగర్ ప్రాంతాల్లో పలు వాహన షోరూమ్‌లు వ్యాపార కార్యకలాపాలు సాగిస్తుండగా, పాతగాజువాక జంక్షన్ నుంచి సినిమా హాల్ జంక్షన్ మీదుగా కొత్తగాజువాక వరకు ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థలకు చెందిన ఆధునిక షోరూమ్‌లు ఏర్పాటయ్యాయి. వీటితో పాటు మరిన్ని సంస్థలకు చెందిన మాళ్లు, హాళ్లు ఇక్కడ ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేసుకొంటున్నాయి.

పండగ రోజుల్లో ..

సంక్రాంతి, వినాయకచవితి, దసరా, దీపావళి, క్రిస్మస్, రంజాన్ పండగల్లో రోజుకు 10 నుంచి 15 కోట్ల రూపాయల వరకు వ్యాపారం సాగుతుందని వ్యాపారవర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో **కార్పొరేట్ సంస్థలు ఇక్కడ తమ సంస్థలను నెలకొల్పడానికి ముందుకొస్తున్నాయి.**

జంట పట్టణాలుగా..

మహా విశాఖలో అతి పెద్ద జోన్‌గా ఉన్న గాజువాకలో ప్రస్తుతం కూర్మన్నపాలెం, గాజువాక ప్రాంతం జంట పట్టణాలుగా అభివృద్ధి చెందాయి. నిన్న మొన్నటివరకు గాజువాక మాత్రమే కమర్షియల్‌గా ప్రఖ్యాతి గడించింది. ఇప్పుడు కూర్మన్నపాలెం కూడా గాజువాకకు దీటుగా ప్రతిష్ట పెంచుకుంది. కూర్మన్నపాలేనికి పరిసర ప్రాంతాల్లో అనేక అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, వివిధ వ్యాపార సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, మల్టీప్లెక్స్ థియేటర్లు, మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు, విద్యా సంస్థలు వచ్చాయి. ఈ అభివృద్ధిని గమనించిన జీవీఎంసీ ఈ ప్రాంతంలో వివిధ రోడ్లను కమర్షియల్‌గా నిర్ధారించింది.



గాజువాక మెయిన్‌రోడ్డు

వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి

ఖరీదైన వస్తువు కొనాలంటే నగరానికి పరుగులు తీయాల్సిన పరిస్థితి ఇప్పుడు మారింది. కార్పొరేట్ షాపింగ్ మాళ్లు తమ బ్రాంచిలను ఏర్పాటు చేస్తుండటంతో కొనుగోలుదారుల అవసరాలు ఇక్కడే తీరుతున్నాయి. బ్రాండెడ్ దుస్తులు, ఆభరణాలు, ఇతర సామగ్రి గాజువాకలోనే లభిస్తున్నాయి. నగరంలో పేరుమోసిన వాణిజ్య సంస్థలన్నీ గాజువాకలో ప్రాంతంలో తమ శాఖలను విస్తరిస్తున్నాయి. సీఎంఆర్ షాపింగ్‌మాల్, ఎస్ఆర్ షాపింగ్ మాల్, కంకటాల, కేఎల్ఎం ఫ్యాషన్‌మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఆర్‌కే స్టోర్స్, కళానికేతన్, ఖజానా జ్యూయలర్స్, జీఆర్‌టీ జ్యూయలర్స్, మలబార్ జ్యూయలర్స్, జాయ్ అలుకాస్, అరవింద్, అమర్‌దీప్, లీ ఫ్యాషన్స్, కంటిపూడి నిస్సాన్, ఎస్ఆర్ఎంటీ, బీన్యూ మొబైల్ షోరూమ్, బిగ్‌సీ, సెల్ డాట్ కామ్, సామ్‌సంగ్, షావోమి తదితర సంస్థలకు చెందిన బ్రాంచిలు గాజువాకలో ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, బంగారం, ఎలక్ట్రానిక్స్, జనరల్ స్టోర్స్, స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లు తదితర సంస్థల నుంచి ఇక్కడ రోజుకు సగటున రెండున్నర కోట్ల రూపాయల వరకు వ్యాపారం సాగుతుందని అంచనా.



అగనంపూడిలో విస్తరించిన అపార్ట్‌మెంట్లు

గాజువాకలో రియల్ జోరు

పెట్టుబడికి ఇదే తరుణం



నాగేశ్వరరావు, శివలోహిత కన్‌స్ట్రక్షన్స్ ఎండీ

గాజువాక: గాజువాక పరిసర ప్రాంతాలు రియల్ ఎస్టేట్‌కు ఎంతో అనుకూలమని శివలోహిత్ కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. ఈ ప్రాంతంలోని వెంచర్లలో ఇప్పుడు పెట్టుబడి పెట్టినవారికి తక్కువ కాలంలో రెట్టింపు లాభాలు వస్తాయన్నారు. పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, కార్పొరేట్ సంస్థల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉండటం, బస్సులతోపాటు రవాణా సౌకర్యాలు పుష్కలంగా ఉండడం వల్ల ఇది సాధ్యమవుతుందన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో స్థలాలకు మంచి గిరాకీ ఏర్పడుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సొంతిళ్లు, స్థలాల కలను సాకారం చేసుకోవాలన్నారు. కాగా, రియల్ ఎస్టేట్ రంగంలో తమ సంస్థకు 24 ఏళ్ల అనుభవం ఉందన్నారు. ఇప్పటివరకు నాలుగు వెంచర్లు పూర్తి చేశామన్నారు. హైదరాబాద్‌లో ఒకటి, గాజువాక పరిసర ప్రాంతాల్లో మూడు వెంచర్లు కలుపుకొని మొత్తం వంద ఎకరాల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. వెంచర్లలో అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ సౌకర్యాన్ని తొలుత తామే అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించాలి

అక్కిరెడ్డిపాలెం: విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించాలని భెల్ (హెచ్‌పీవీపీ) భెల్ (హెచ్‌పీవీపీ) ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సంస్థలో జరిగిన సమావేశంలో నాయకులు జి.టి.పి.ప్రకాష్, సీతంనాయుడు, ఎస్.జగన్నాథరావు, వి.ఆనందరావు, కె.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పెదగంట్యాడ: విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని మోదీ ప్రకటించాలని సీపీఐ నాయకులు మంగళవారం పోతిన సన్యాసిరావు భవన్ నుంచి పెదగంట్యాడ జంక్షన్ వరకూ నిరసన ప్రదర్శన చేపట్టారు. సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ , ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అచ్యుతరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పుల వల్లే క్యాన్సర్

మహారాణిపేట : జీవన శైలిలో వచ్చిన మార్పులు వల్లే క్యాన్సర్ విజృంభిస్తోంది. కాలుష్య ప్రభావం, అలవాట్లు, వ్యసనాలు, జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యం వల్ల రోజురోజుకూ క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రకృతి పరంగా దొరికే ఆహారం లేకపోవడం, అర్బన్‌లో ఎక్కువగా జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతుండడంతో పురుషులు, స్త్రీలు అన్న తేడా లేకుండా అందరూ క్యాన్సర్‌కు గురవుతున్నారు. స్త్రీలలో ఎక్కువగా రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బాధితులు పురుషులు కన్నా ఎక్కువగా ఉన్నారు. తగినంత వ్యాయమం లేకపోవడం, పొగాకు వినియోగం, ఖైనీ, ఆల్కహాల్ వినియోగం వల్ల లక్షలాది మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. వ్యాయమం చేయడం, ఊబకాయాన్ని నివారించడం, జీవన శైలి మార్పులు ద్వారా క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చు. భారత ప్రభుత్వ పథకం ఆయుస్మాన్ భారత్, రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకంతో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారందరికీ క్యాన్సర్ సంరక్షణను అందిస్తున్నారు. లంగ్ క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భసంచి ముఖ ద్వార క్యాన్సర్‌ను నయం చేయవచ్చు. తొలి దశలో గుర్తిస్తే ఎలాంటి క్యాన్సర్ అయినా నివారించవచ్చు. క్యాన్సర్ సోకిందని భయపడాల్సిన అవసరం లేదు. సకాలంలో గుర్తించి మందులు వాడి ఎంతో మంది క్యాన్సర్‌ను జయించారు.

– డాక్టర్ బెల్లాల రవిశంకర్, మేనేజింగ్ డైరెక్టర్, ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి



పక్షులను, పర్యావరణాన్ని కాపాడుదాం





పక్షులను కాపాడి పర్యావరణ సమతుల్యానికి బాటలు వేద్దాం. ఈ మేరకు సత్వా నేచురల్స్ స్టోర్‌కు వచ్చే వినియోగదారులకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకొస్తున్నాం. సెల్‌ఫోన్ టవర్స్ రేడియేషన్ వల్ల పక్షుల మనుగడకు ముప్పు ఏర్పడింది. అలాగే క్రిమి సంహారక మందులతో పంటలు పండించడంతో ఆ ఆహార గింజలు తిని చిన్నచిన్న కీటకాలు, పక్షులు మృత్యువాత పడుతున్నాయి. నగరీకరణలో భాగంగా చెట్లు నరికి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడంతో పక్షుల గూళ్లు కట్టుకునే నివాస పరిస్థితులు తగ్గిపోయాయి. పక్షులు తమ జీవనాన్ని కొనసాగించే వాతావరణాన్ని కల్పించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. పక్షులకు ఆహారం, నీరు అందించి, ఇంటి ఆవరణలో వరి కంకులు, గూళ్లు అమర్చి పక్షులకు నివాసాన్ని కల్పించాలి. అంతరించిపోతున్న పిచ్చుకలు, పావురాలు, రామ చిలుకలు ఇతర పక్షులను కాపాడుకునేలా సత్వా నేచురల్స్ కృషి చేస్తోంది. రైతుల నుంచి వరి కంకులు సేకరించి అదే ధరకు తమ స్టోర్‌కు వచ్చే కస్టమర్లకు అందించి ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నాం.

– వి.లక్ష్మీ తేజ, సత్వా నేచురల్స్, సీతమ్మధార.

జేఎస్ఆర్‌లో ఆఫర్లకు విశేష ఆదరణ

సీతంపేట : జగదాంబ జంక్షన్‌లోని జేఎస్ఆర్ షాపింగ్‌మాల్‌లో ఆఫర్లకు విశేష ఆదరణ లభిస్తోంది. సంక్రాంతి పండగ సందర్భంగా అన్ని వస్త్రాలపై 70 శాతం వరకు డిస్కౌంట్ లభిస్తోంది. మెగా సేల్‌లో భాగంగా ఆధునిక, సంప్రదాయ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. ఫ్యాన్సీ, డిజైన్, సిల్క్, బెనారస్ చీరలు, చుడీదార్స్, డ్రెస్ మెటీరియల్, కుర్తీస్, లెహంగాస్, గాగ్రాస్, కిడ్స్, వెస్టన్ వేర్ దుస్తులు షోరూంలో ఆకట్టుకుంటున్నాయి. కుర్తీస్ రూ.99ల నుంచి మొదలు కానుండగా, చీరలు రూ.149 నుంచి ధరల్లో లభిస్తున్నాయి. వెస్టన్ వేర్ రూ.249ల నుంచి లభిస్తాయని షోరూం మేనేజర్ వేగి జగదీష్‌కుమార్ తెలిపారు.



క్రికెట్ మ్యాచ్‌ల డ్రా షెడ్యూల్ ఆవిష్కరణ



షెడ్యూల్ విడుదల చేస్తున్న సెలబ్రిటీలు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 10, 11, 12వ తేదీల్లో సంక్రాంతి సందర్భంగా బీహెచ్‌పీవీ హార్ట్‌ఫుల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో భెల్ క్రీడా మైదానంలో నిర్వహించనున్న క్రికెట్ పోటీల డ్రా షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. డ్యాన్స్ మాస్టర్లు పండు, రమేష్, పల్సర్ బైక్ ఝాన్సీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు




ముగ్గు వేస్తున్న విద్యార్థి

గాజువాక: స్థానిక టీఎసార్, టీబీకే డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు మంగళవారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. రంగవల్లులు, హరిదాసులు, భోగిమంటల సంక్రాంతి సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ ముగ్గుల పోటీల విజేతలకు రూ.1000 చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఘనంగా ధనుర్మాస పూజలు



అన్నమాచార్యకీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

అగనంపూడి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున మేలుకొలుపు చేశారు. అన్నమయ్య భక్తిగీతాలాపన చేశారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

అగనంపూడి: రెవెన్యూ సదస్సులతో భూ సరిహద్దు వివాదాలు, భూ తగాదాలకు పరిష్కారమవుతాయని గాజువాక తహసీల్దార్ తోట శ్రీవల్లి అన్నారు. 85వ వార్డు పెదముడక, శనివాడలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, రౌతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.